క్లుప్తంగా

రేషన్ షాపులు, పెట్రోల్ బంక్‌ల తనిఖీ



మైలవరం: రెడ్డిగూడెం గ్రామంలో రేషన్ షాపులు, పెట్రోల్ బంక్‌లను తహసీల్దార్ జె. సుశీలాదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెడ్డిగూడెం గ్రామంలోని శ్రీ వీరాంజనేయ అడహక్ పెట్రోల్ బంక్, 12, 13 నంబర్ రేషన్ షాపులను సందర్శించి రేషన్ షాపుల్లో రికార్డులు, కాటాలను పరిశీలించారు. షాపులో ఉన్న వినియోగదారులను అడిగి రేషన్ పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చెప్పారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ



జి.కొండూరు: కవులూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన తాడికొండ నారాయణరావు రూ.10 వేల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలను రైతు సంఘం నాయకుడు చెరుకూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జై కళానిధి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా మిత్ర కిట్ల పంపిణీ



చిట్టేల(తిరువూరురూరల్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరఫరా చేసిన రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లను మండలంలోని చిట్టేల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పంపిణీ చేశారు. విద్యా కిట్లతో పాటు యూనిఫాంను సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు అందజేశారు. విద్యార్థులు కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు



మునుకుళ్ల(తిరువూరురూరల్): మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం విద్యార్థులు వీడ్కోలు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ముష్టికుంట్ల జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయిన బెల్లంకొండ వీరభద్రరావును, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బాబాసాహెబ్, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు మీనుగు రాంబాబు, ఆంగ్ల ఉపాధ్యాయిని రేణుకలను సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె. మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతనివ్వాలి



చాత్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలని సి-గుడిపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎ.బక్కయ్య అన్నారు. బుధవారం స్థానిక హైస్కూల్లో 100 మంది విద్యార్థులకు స్నేహ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. ఫౌండేషన్ కార్య నిర్వాహకులు వెంకటేశ్వరరెడ్డి, యోగేంద్రరెడ్డి, నాయకులు పుచ్చకాయల నోబల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



నూజివీడు: పట్టణంలోని మైలవరం రహదారిలో శ్రీనివాస సెంటర్ వద్ద స్టేషన్ తోట వైపునకు వెళ్లే రోడ్డులో వర్షం నీరు మూడు రోజులుగా నిల్వ ఉంది. నిలిచిన వర్షం నీటిలోనే స్థానికులు రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ నీరు నిల్వ ఉండకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

చినుకు పడితే నరకమే

- వర్షం కురిస్తే వాగులను తలపిస్తున్న రహదారులు
- వర్షంనీటిలోనే రాకపోకలు
- చెత్తచెదారంతో నిండిన డ్రెయినేజీలు
- పూడిక తీసినా మారని పరిస్థితి



పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు (ఫైల్)



పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో నిలిచిన వర్షం నీరు (ఫైల్)

నూజివీడు: పట్టణంలో ప్రధాన కూడళ్లైన చిన్న గాంధీబొమ్మ సెంటర్, పెద్ద గాంధీబొమ్మ సెంటర్లతో పాటు ప్రధాన రహదారులు వర్షం వస్తే వాగులను తలపిస్తున్నాయి. మైలవరం, విస్సన్నపేట, విజయవాడ, హనుమాన్ జంక్షన్ల వైపునకు పట్టణంలో ప్రధాన రహదారులు ఉన్నాయి. నాలుగు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు, ప్రయాణికులకు నూజివీడు కూడలి. నూజివీడు పట్టణంలో రెవెన్యూ డివిజన్ కేంద్రం, జిల్లా న్యాయస్థానంతో పాటు ఐదు కోర్టులు ఉన్నాయి. ఇంత ప్రధానమైన పట్టణంలో వర్షం వస్తే రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. డ్రెయినేజీలోని మురుగు నీరు, వర్షం నీరు రోడ్డు పైనే ప్రవహిస్తోంది. వర్షం తగ్గాక కూడా దాదాపు అర గంటకు పైగా రోడ్డు పైనే వరద నీరు, మురుగు నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పురాతన చరిత్ర ఉన్న పట్టణమైనప్పటికీ డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుకాకపోవడంతో ప్రజలు అనేక అవస్థలకు గురవుతున్నారు. పట్టణానికి ఇతర ప్రాంతాల వారు వచ్చి చూసి ఇదేం పట్టణమంటూ వ్యాఖ్యానాలు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో చెప్పవలసిన అవసరం లేదు. ఎప్పుడో 50 ఏళ్ల కిందట పంచాయతీ కాలంలో నిర్మించిన డ్రెయినేజీలే నేటికి ప్రధాన ప్రాంతాల్లో ఉండటం, ఉన్న అరకొర డ్రెయినేజీలు ఆక్రమణలకు గురి కావడం వంటి పరిస్థితుల కారణంగా అవి ప్రస్తుత మురుగు నీటి ప్రవాహానికి అనుగుణంగా లేక ఇబ్బందులు నెలకొంటున్నాయి.

ఎవరిష్టం వారిదే..

పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా డ్రెయినేజీల్లో పూడికను తొలగించే పనులు చేస్తున్నప్పటికీ, తొలగించిన కొద్ది రోజులకే డ్రెయినేజీలు చెత్తచెదారంతో నిండిపోతున్నాయి. దీంతో మురుగునీరు కాని, వర్షం నీరు కాని ప్రవహించడానికి వీలు లేక రోడ్లపైకి చేరుతోంది. తోపుడు బండ్ల వ్యాపారులు, పూలకొట్లు, కిరాణా షాపులు, హోటళ్లు, కూరగాయల దుకాణాలు, కొబ్బరి బొండాలు, టీ స్టాల్స్, జ్యూస్ పాయింట్లు, కర్రీ పాయింట్లు తదితర అన్నిరకాల షాపుల వారు చెత్తను డ్రెయినేజీల్లోకి ఊడ్చేయడమే కాకుండా పాలిథిన్ కవర్లను కూడా అందులోనే పడేస్తున్నారు. వీటితోనే డ్రెయినేజీ నిండిపోయి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. మురుగు నీరు, వర్షం నీరు ప్రవహించడానికి డ్రెయినేజీలో చెత్తచెదారం, పాలిథిన్ కవర్లు అడ్డుగా ఉండటంతో రోడ్డు పైకి వర్షం నీరు చేరుతోంది. పెద్ద వర్షం అయితే రోడ్లపై మోకాలి లోతు వరకు నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పురపాలక సంఘం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చెత్తచెదారం వేయకుండా చూడాలి



పట్టణంలోని డ్రెయినేజీల్లో చెత్తచెదారం వేయకుండా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. చెత్తచెదారం వేయడం వల్ల కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పించాలి. కొన్ని చోట్ల కల్వర్టులు పూడిపోయి మురుగు నీరు కదలడం లేదు. వాటి స్థానంలో నూతన కల్వర్టులు నిర్మించాలి.

–చాట్ల పుల్లారావు, సీపీఐ పట్టణ కార్యదర్శి

ఆక్రమణలు తొలగించాలి



పట్టణంలో ఎక్కడ చూసినా డ్రెయినేజీలు, రోడ్డు మార్జిన్లు ఆక్రమణకు గురయ్యాయి. డ్రెయినేజీల్లో టీ గ్లాసులు, పాలిథిన్ కవర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, చెత్తచెదారం పేరుకుపోతోంది. మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. డ్రెయినేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలి.

–జయచంద్ర శ్రీనివాస్, నూజివీడు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తిరువూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివాస ప్రాంతాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ మనోజ అన్నారు. ఇళ్లల్లోని చెత్తచెదారం, వ్యర్థాలను రోడ్లపై వేయవద్దని, ఇంటింటికీ చెత్త సేకరణకు వచ్చిన సిబ్బందికి అప్పగించాలని ఆమె సూచించారు. ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిలవకుండా యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు ప్రబలకుండా నీటిపారుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

80 మందికి వైద్య పరీక్షలు

విస్సన్నపేట: స్థానిక సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్యసాయి సేవా మందిరం వద్ద బుధవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. నూజివీడు గిఫర్డు మెమోరియల్ కంటి వైద్య నిపుణులు పి. విజయలక్ష్మి, సిబ్బంది 80 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 38 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి నూజివీడు గిఫర్డు మెమోరియల్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని ట్రస్ట్ అధ్యక్షుడు జగ్గవరపు రంగారెడ్డి తెలిపారు.

దోమల నివారణపై అవగాహన

విస్సన్నపేట: స్థానిక ఒకటో గ్రామ సచివాలయం పరిధిలో దోమల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమతెరలు వాడాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, ఎస్‌యూఓ ఎస్‌కే బాబావలి, తెల్లదేవరపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు కె. శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



బడేమియా దంపతులను సత్కరిస్తున్న జోగి రమేష్, నాయకులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన షేక్ బడేమియా సన్మాన కార్యక్రమం ఇబ్రహీంపట్నంలో బుధవారం నిర్వహించారు. బడేమియా దంపతులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఘనంగా సన్మానించారు. ఉద్యోగిగా, యూనియన్ నేతగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. మాజీ సర్పంచి మల్లెల పద్మనాభరావు జీవిత చరిత్ర పుస్తకాన్ని బడేమియాకు అందజేశారు. నాయకులు మల్లెల శ్రీనివాస్ చౌదరి, మేడపాటి నాగిరెడ్డి, మునగాల శివారెడ్డి, పీతా శ్రీనివాసరాజు, నల్లమోతు ప్రకాష్, వాహెద్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష ప్రయోగాలపై ఆసక్తి పెంపొందాలి



విద్యార్థినులతో ఆస్ట్రోనాట్‌గా ఎంపికైన జాహ్నవి

జి.కొండూరు: అంతరిక్ష ప్రయోగాలపై ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఆసక్తి పెంచుకోవాలని దంగేటి జాహ్నవి అన్నారు. ఆస్ట్రోనాట్‌గా ఎంపికైన ఆమె బుధవారం కుంటముక్కల గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ ఆస్ట్రోనాట్‌గా ఎంపిక కావడానికి ఆమె పడిన కష్టాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ ఏఎంఓ అశోక్‌బాబు, డీసీఓ మురళీకృష్ణ, హెచ్‌ఎం కె.బ్యూలా, కుంటముక్కల సర్పంచ్ వంగూరి కుమారి పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలపై దృష్టి సారించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పాఠశాల స్థాయి నుంచే బాలబాలికలు శాస్త్ర, సాంకేతిక రంగాలపై దృష్టి సారించాలని టైటాన్ స్పేస్ ప్రైవేట్ అంతరిక్ష యానానికి ఎంపికైన దంగేటి జాహ్నవి అన్నారు. ప్రభుత్వ సూచనలతో జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు అంతరిక్ష యానంపై అవగాహన కల్పిస్తున్న జాహ్నవి కొండపల్లి ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తన అనుభవాలను ఆమె పంచుకున్నారు. విద్యార్థులు అంతరిక్ష యానంపై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ, సమగ్రశిక్ష ఏఎంఓ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై రాకపోకలు ఎలా సారూ..

సుపరిపాలనలో ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు షాకు ఇచ్చిన ప్రజలు

తిరువూరు: 'మండల కేంద్రం నుంచి మా గ్రామానికి వచ్చే ఆర్ అండ్ బీ రోడ్డు గోతులమయమై ప్రమాదాలు జరుగుతున్నాయి. అడుగడుగునా గోతులతో నిండి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. మా రోడ్డును పట్టించుకునేవారెవరు సార్' అంటూ తిరువూరు మండలం కోకిలంపాడు గ్రామస్తులు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును ప్రశ్నించారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే కోకిలంపాడులో ప్రారంభించారు. తిరువూరు నుంచి కోకిలంపాడు వరకు పూర్తిగా ధ్వంసమైన రహదారిని ఒక్కసారి చూసి పరిష్కారం చూపండని మహిళలు ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు గ్రామాలకు కూడా ఈ రహదారి పైనే ప్రజలు రాకపోకలు సాగిస్తారని, నిత్యం రద్దీగా ఉండే రహదారి ధ్వంసమై ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఇకనైనా గమనించాలని కోరారు. ఏడాది పాలనలో ప్రజలకందిన సంక్షేమ పథకాలపైనే ఈ కార్యక్రమం చేపట్టామని, రోడ్ల దుస్థితి గురించి తర్వాత మాట్లాడదామని ఎమ్మెల్యే వెంట ఉన్న నాయకులు దాటవేశారు. గ్రామంలోని సంజీవపురం కాలనీ, ఎస్సీ కాలనీలలో ఎమ్మెల్యే పర్యటించారు.

- నూజివీడు: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమం, ప్రగతి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పల్లెర్లమూడి, సీతారామపురం, మర్రిబంధంలలో బుధవారం ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు

విజయవాడకల్చరల్: ప్రతిభామూర్తుల సేవలను గుర్తు చేసుకోవాలని సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, శ్రీ కళాభారతి, సంగీత సమ్రాట్ కళాసంస్థ, కేవీ బ్రహ్మానందరావు కళా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోస్‌లో సినీ సంగీత విభావరి సేవా మూర్తులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మానందరావు మాట్లాడుతూ.. కళాకారులు సాంస్కృతిక వారధులన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు వెంకటేశ్వర్లు, విశ్రాంత పోలీస్ అధికారి ఎం.కృష్ణమూర్తి నాయుడును ఆత్మీయంగా సత్కరించారు.

వాటర్ కూలర్ బహూకరణ



గ్రంథాలయానికి దాతలు అందజేసిన వాటర్ కూలర్

ఆగిరిపల్లి: దాత జూలూరి శోభనా చలపతి గుప్తా ఆర్థిక సహాయంతో స్థానిక గ్రంథాలయానికి వాటర్ కూలర్‌ను బహూకరించారు. విద్యార్థులకు 100 నోట్ పుస్తకాలను బహూకరించారు. వీరిని ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి డి.నాగేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు, బస్‌షెల్టర్ ప్రారంభం

నూజివీడు: మండలంలోని పల్లెర్లమూడిలో దాత డి.కృష్ణమోహన్ దావులూరి ఫౌండేషన్ ద్వారా రూ.8.50 లక్షలతో నిర్మించిన బస్‌షెల్టర్, మంచి నీటి ప్లాంట్‌ను మంత్రి పార్థసారథి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వాటర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలి

ఆగిరిపల్లి: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ కార్యదర్శులు మండలంలోని వాటర్ హెడ్ ట్యాంక్‌లను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ భార్గవి అన్నారు. ఆగిరిపల్లిలోని వరాహ పుష్కరిణి వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను బుధవారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలో వాటర్ ట్యాంకులను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

మునునూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటానని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఇటీవల రహదారి ప్రమాదానికి గురైన మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ రంగు సత్యనారాయణ, పార్టీ యువ నాయకులు ఉప్పే రామకృష్ణలను మంగళవారం రాత్రి ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు గ్రామంలోని కార్యకర్తలు కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. త్వరగా కోలుకోవాలని బాధితులను ఓదార్చారు. మండల పార్టీ అధ్యక్షుడు ముల్పూరి నాగమల్లేశ్వరరావు, ఎంపీపీ కొండా దుర్గాభవాని, సర్పంచ్ ధనలక్ష్మి, రైతు సంఘం జిల్లా మాజీ సలహాదారు పల్లె రవీంద్ర, సొసైటీ మాజీ అధ్యక్షుడు నామాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడిక తీత

మైలవరం: రెడ్డిగూడెం ఎస్సీ ఏరియాలో డ్రెయినేజీల్లో పూడిక తీత పనులు బుధవారం ప్రారంభించారు. ఎస్సీ ఏరియాలోని వెల్‌నెస్ సెంటర్ వద్ద డ్రెయినేజీలో పేరుకుపోయిన పూడికతో రహదారి పైకి మురుగు నీరు రావడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్ స్థానిక అధికారులతో మాట్లాడి డ్రెయినేజీ పూడిక తీయించారు.

పార్వతి అమ్మవారికి సారె సమర్పణ

కాచవరం(ఇబ్రహీంపట్నం): ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని కాచవరంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారికి భక్తులు బుధవారం సారె సమర్పించారు. చీరలు, పసుపు కుంకుమ, పూలు, పండ్లు, పిండి వంటలు ఆలయ అర్చకులు కంచిభొట్ల సుబ్రహ్మణ్యశర్మ ద్వారా అమ్మవారికి సమర్పించారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలతో సంతోషంగా గడపాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

జూదరుల అరెస్ట్

తిరువూరు: తిరువూరు పట్టణంలోని నివాస గృహాల నడుమ నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.15,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. సెక్టార్-1 ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సన్మానం

ఆగిరిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను దాతలు ఘనంగా సన్మానించారు. దాత జూలూరు స్వరాజ్ కిశోర్ ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్ మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పుష్పలత, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు జూలూరు చంద్రమౌళీశ్వరరావు, పూర్వ విద్యార్థులు కృష్ణవేణి, పి.చంద్రశేఖర్, గోపాలకృష్ణ, వెంకటరత్నం, జూలూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ఆయాల ఆందోళన



విస్సన్నపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు నాలుగు నెలల నుండి జీతాలు ఇవ్వడం లేదని, పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు మర్సకట్ల త్యాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఆయాలు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆయాలకు నెలనెలా జీతాలు చెల్లించాలని, నెలకు రెండు రోజులు అత్యవసర సెలవులు ఇవ్వాలని కోరుతూ ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయాలు, మధ్యాహ్న భోజన కార్మికులు బి. ధనలక్ష్మి, ఎస్. అంజమ్మ, కె. లక్ష్మి, ఎ. రమాదేవి, నాగమణి పాల్గొన్నారు.

తల్లికి వందనం అమలు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మున్సిపాల్టీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు కూడా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కొండపల్లి మున్సిపాల్టీలోని డంపింగ్ యార్డ్ వద్ద కార్మికులు బుధవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ మున్సిపాల్టీ ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, రిటైర్‌మెంట్ వయస్సు పెంచడంతో పాటు బెనిఫిట్స్ అందజేయాలని, మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఏడాదికి 15 సెలవులు, మహిళలకు అదనపు సెలువులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు దేవుళ్లు, సహాయ కార్యదర్శి మణికంఠ, కార్మికులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

డీఎంహెచ్‌ఓ సుహాసిని



జి.కొండూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న సుహాసిని

జి.కొండూరు: ప్రతి చిన్నారికి పుట్టిన నాటి నుంచి 24 నెలల వరకు అన్ని రకాల టీకాలను తప్పనిసరిగా వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని సిబ్బందికి సూచించారు. స్థానిక సచివాలయం-1లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆమె పర్యవేక్షించి మాట్లాడారు. టీకాల కార్యక్రమంలో డ్రాప్‌అవుట్స్ లేకుండా ప్రతి శిశువు లబ్ధి పొందే విధంగా ప్రోత్సహించాలన్నారు. తొలుత జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. వైద్యసేవలు, ఓపీ, మందుల లభ్యత, సిబ్బంది హాజరు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న రాణి పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు

తిరువూరురూరల్: ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తాము కూడా సమ్మెలో పాల్గొంటామని తిరువూరు మండల ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం మెడికల్ ఆఫీసర్లకు నోటీసులు అందజేశారు. చౌటపల్లి, రాజుగూడెం పీహెచ్‌సీలలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు తమ సమస్యలను వైద్యాధికారులకు వివరించారు. నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని తదితర డిమాండ్ల సాధనకై సమ్మె చేపడుతున్నామని వివరించారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

నూజివీడు: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల నాయకులతో కలిసి బుధవారం పురపాలక సంఘ కార్యాలయం మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ముత్యాల విజయ్, ఆకుల మహేష్, సింగపల్లి శ్యామల, బంగారు నాగమణి, ఆకుల హరికృష్ణ, ముత్యాల సరస్వతి పాల్గొన్నారు.

వార్డు సచివాలయం సెక్రటరీల బదిలీల్లో అన్యాయం



వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల వార్డు సచివాలయం సెక్రటరీల బదిలీలో జీఓ నిబంధనలు పాటించకుండా బదిలీలు నిర్వహించారని, కౌన్సెలింగ్ ద్వారా న్యాయం చేయాలని వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ జేఏసీ చైర్మన్ బి.గంటయ్య కోరారు. వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం సీడీఎంఏ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిసి తమకు న్యాయం చేయాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న తమను ఉపయోగం ఉండే అన్ని శాఖలలో తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రమోషన్ చానల్ విషయంలో కూడా తమకు అన్యాయం జరుగుతోందని, పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ విషయంపై తాను పరిశీలించి న్యాయం చేస్తానని సంపత్‌కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ యశ్వంత్, కో కన్వీనర్ శ్రీకాంత్, రాజశేఖర్, యూనియన్ నాయకులు మణికంఠ, మాధురి, గాయత్రి, సునయన, భువన, విద్య పాల్గొన్నారు.